



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రయివేట్‌కు ఆదోని మెడికల్ కళాశాల

• రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం • వ్యక్తమవుతున్న వ్యతిరేకత

గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయదలచిన వైద్య కళాశాలల్లో ఆదోని వైద్య కళాశాల ఒకటి. కళాశాల నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. తీరాచ ఇప్పుడు పిపిపి విధానంలో ప్రయివేటుకు ఆదోని వైద్య కళాశాలను కట్టబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా కేంద్రానికి ఆదోని పట్టణం వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో ఏవైనా ప్రమాదాలు జరిగినా అత్యవసర వైద్య సేవలు కావాలన్నా కర్నూలు వెళ్లాల్సి వస్తోంది. లేదంటే బళ్లారి, రాయచూర్ వెళ్లాల్సి ఉంటుంది. ఆదోని పట్టణంలోనే వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే ఆలూరు, ఆదోని, కోసిగి, కౌతాళం, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం తదితర ప్రాంతాల ప్రజలకు ఎంతో దగ్గరగా ఉంటుంది. మెరుగైన సేవలు పొందటానికి వీలుగా ఉంటుంది. 2021 మే 31న రాష్ట్ర వ్యాప్తంగా 14 వైద్య కళాశాలలకు వర్చువల్ విధానంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదోని శివారులో ఎమ్మిగనూరు వెళ్లే మార్గంలో అరేకల్ వద్ద వైద్య కళాశాల పనులకు శ్రీకారం చుట్టారు. 58 ఎకరాల విస్తీర్ణంలో వంద మెడికల్ సీట్లు, 450 పడకల సామర్థ్యంతో రూ.475 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని ప్రకటించారు. 2023 చివరి నాటికి మెడికల్ కాలేజీని అందుబాటులోకి తీసుకువస్తామని ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. మూడేళ్లు గడిచినా ఇప్పటి వరకూ వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. వైద్య కళాశాలకు సంబంధించి ఒక బ్లాకు మూడు ఫ్లోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. మరో బ్లాకు రెండు ఫ్లోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. బాలికల హాస్టల్ ఆరు ఫ్లోర్లు, బాలుర హాస్టల్ రెండు ఫ్లోర్లు శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. కిచెన్ పనులు ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. అత్యవసర విభాగం, ఇఎస్ఎస్ 1, 2 పనులు కూడా ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఆదోని వైద్యశాల నిర్మాణ పనులు ఆపేసింది. తీరా ఇప్పుడు పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో ఆదోని వైద్య కళాశాల పనులు చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆగిన మెడికల్ కళాశాల భవన నిర్మాణం

ప్రయివేట్‌కు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలి



అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఆదోనిలో ప్రభుత్వ వైద్యకళాశాల వచ్చిందని ప్రజలందరూ ఆనందం వ్యక్తం చేశారు. వైద్య కళాశాల నిర్మిస్తే దానికి అనుబంధంగా ఆస్పత్రి కూడా నిర్మాణం జరుగుతుంది. దాని ద్వారా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం వాసులకు మెరుగైన వైద్యం అందేది. వాటిని నీరు గార్చేలా ప్రభుత్వం ఆదోని వైద్య కళాశాలను ప్రయివేటు పరం చేయడం సరికాదు. ప్రయివేటుకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలి. వైద్య కళాశాల నిర్మాణ పనులను ప్రభుత్వమే వెంటనే పున: ప్రారంభించాలి.

- కె.శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు.

శుభ్రతపై దృష్టి పెట్టండి

- రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి
- విద్యార్థులు అందరూ బాగా చదవాలి
- దేవనకొండలో కలెక్టర్ రంజిత్ బాషా ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి - దేవనకొండ

అంగన్వాడీ కేంద్రం ఆవరణలో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. బుధవారం ఆయన దేవనకొండలో ఆకస్మిక పర్యటన చేపట్టారు. ముందుగా కోరమండల్ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని పరిశీలించి రైతులకు అందిస్తున్న యూరియా బస్తాల స్టాక్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎరువుల సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఎఒ ఉషారాణిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని సందర్శించి రోజువారీ రోగుల ఓపి, డెలివరీ కేసుల గురించి విజయ భాస్కర్‌తో మాట్లాడారు. ఔషధాల గది, కాన్పుల విభాగాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ కొరత ఉందని వైద్యాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే డిఎంహెచ్ఒతో మాట్లాడి ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం ఆవరణలో పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ గోపాల్‌ను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి రఫీ గైర్హాజరు కావడంతో మెమో ఇవ్వాలని డిప్యూటీ ఎంపిడిఒకు సూచించారు. నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును ఉపయోగంలోకి తీసుకురావాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ మురళీ విజయ్‌ను ఆదేశించారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థులందరూ బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. తరగతి గదుల్లో వైట్ వాష్ వేయించాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తీసుకోవాలని ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు సూచించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం శిథిలావస్థలో ఉన్న డిఎన్‌టి హాస్టల్ భవనాన్ని పాఠశాలకు కేటాయించాలని ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం ఈదులదేవరబండ గ్రామ శివారుల్లో ఉల్లి పంటను ఆరబెట్టుకున్న రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లికి ఇస్తున్న రూ.1200 మద్దతు ధరను ఉపయోగించుకోవాలని, నాణ్యతతో కూడిన ఉల్లి ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లాలని సూచించారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, తహశీల్దార్ రామాంజనేయులు, ఎంఇఒ విజయనిర్మల, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శివలింగమ్మ, పంచాయతీ కార్యదర్శి రఫీ పాల్గొన్నారు.

డిఎస్‌సి పోస్టింగులపై స్పష్టత కరువు

-అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన పూర్తి -కొంతమంది అభ్యర్థుల పత్రాలపై సందేహం
-తలమునకులవుతున్న విద్యాశాఖాధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం మెగా డిఎస్‌సి పేరుతో ఊదరగొట్టు ప్రచారాన్ని నిర్వహించుకుంటుంది. డిఎస్‌సిలో ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగుల కేటాయింపుపై ఇప్పటివరకు స్పష్టత లేదు. పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధృవీకరణ పత్రాలను విద్యాశాఖ అధికారులు పరిశీలన చేస్తున్నారు. ఇందులో కొంతమంది అభ్యర్థుల పత్రాలపై కూడా సందేహాలు నెలకొనడంతో విద్యాశాఖ అధికారులు సతమతమవుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2645 పోస్టులను భర్తీకి విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దాదాపుగా 39,000 మంది పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పోస్టులకు మాత్రం 2525 మంది అభ్యర్థులకు కాల్ లెటర్లను పంపారు. కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు నేరుగా వెళ్లి ధృవీకరణ పత్రాల పరిశీలన చేసుకున్నారు. వాస్తవానికి డిఎస్‌సి అభ్యర్థుల ఎంపిక మెరిట్ జాబితాను విడుదల చేయకుండా నేరుగా ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్లను పంపడం పట్ల కూడా అనేక సందేహాలు నెలకొన్నాయి. ఎంపికైన అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలనను విద్యాశాఖ అధికారులు పూర్తిచేసి జాబితాను ఉన్నతాధికారులకు పంపారు. ఇందులో 155 మంది అభ్యర్థులను అనర్హులుగా తేల్చారు. 65 పోస్టులకు అభ్యర్థులు లేనట్లు నిర్ధారణ చేశారు. ధృవీకరణ పత్రాల పరిశీలనలో కూడా అనేక గందరగోళం నెలకుంది. కొంతమంది అభ్యర్థుల పత్రాలపై పరిశీలన అధికారుల బృందం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఒక అభ్యర్థి 10వ తరగతి వరకు కన్నడ మీడియంలో చదవగా ఇంటర్మీడియట్ తెలుగు మీడియంలో టెట్ పరీక్షలు మాత్రం తెలుగు మీడియంలో రాశాడు. సదరు అభ్యర్థిని ఎంపిక జాబితాలో ఏ మీడియం కింద ఎంపిక చేయాలని దానిపై విద్యాశాఖ అధికారులు తల మునుకలు అయినటువంటి పరిస్థితి నెలకొంది.. డిఎస్‌సి ఎంపికైన అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలనకు సంబంధించి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో నిబంధనలు కూడా జారీ చేయకపోవడం మూలంగా అధికారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ధృవీకరణ పత్రాల పరిశీలనలో అనేక సందేహాలు కూడా నెలకొన్నాయి. విద్యాశాఖ ఉన్నత అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా హడావిడిగా చేసేశారు. పూర్తిస్థాయి ప్రణాళికతో డిఎస్‌సి ఎంపిక ప్రక్రియను చేపట్టి ఉంటే అభ్యర్థుల్లో ఎలాంటి సందేహాలు నెలకొనేవీ కావు. దసరా సెలవుల్లోపు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. దసరా సెలవుల్లో ఎంపికైన ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి శిక్షణ అనంతరం వారికి స్థానాలను కేటాయిస్తారని విద్యాశాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మేల్కొని ఎంపిక జాబితాను ప్రకటించి పోస్టింగుల కల్పనకు తగు చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి

- సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నేటితరం యువత సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ కోరారు. లక్ష్యాలను సాధించుకునేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. బుధవారం స్థానిక రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల , జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలు , ప్రథమ బిటెక్ విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. 'ఇంజనీర్లుగా కాక ఇంజనీరింగ్ లీడర్స్‌గా విద్యార్థిని విద్యార్థులు ఎదగాలన్నారు. సృజనాత్మకంగా ఆలోచించి పద్మశ్రీ మల్లేశంలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ కెఇ.శ్రీనివాస మూర్తి , డాక్టర్ సి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉషశ్రీ, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎం.గిరిధర్ కుమార్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ జి .శశికుమార్, కళాశాలల విభాగాధిప తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి స్ఫూర్తితో పోరాటం

- వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-పత్తికొండ

సీతారం ఏచూరి స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. సిపిఎం పూర్వపు ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి సభ పత్తికొండ ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి దేశంలో గొప్ప రాజకీయ నేత అని, ప్రపంచంలో గుర్తింపు పొందిన రాజకీయ నాయకుల్లో ఒకరని, మహుభాషా కోవిదుడని కొనియాడారు. చిన్ననాటి నుంచే అభ్యుదయ భావాలకు ప్రభావితమై విద్యార్థి సంఘాల్లో చేరి దేశంలోనే అత్యున్నత స్థాయి కలిగిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో వరుసగా మూడుసార్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి అని తెలిపారు. యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఇంటికి వెళ్లి ఇంటిముందు బైఠాయించి ఆమె బయటకు వచ్చి సమాధానం చెప్పే వరకు అక్కడే కూర్చున్న ఏకైక వ్యక్తి సీతారాం ఏచూరి అని ఆయన తెలిపారు. 2014 తర్వాత దేశం అత్యంత ప్రమాదకర స్థితిలో ఉందని, దానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే కారణమని తెలిపిన మొదటి వ్యక్తి సీతారామ్ ఏచూరి అని తెలిపారు. బిజెపి మతోన్మాదాన్ని ఎదుర్కోకపోతే భారతదేశం 50 యేళ్లు వెనక్కి వెళ్తుందని సీతారామ్ అన్నారని తెలిపారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలు వాటిని ప్రశ్నించకుండా ఉండడానికి మతం పేరుతో ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆంధ్రరాష్ట్రంలో కూడా నరేంద్ర మోడీకి ఊడిగం చేసే ప్రభుత్వాలు ఉండడం వల్ల ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు కూడా నష్టం జరుగుతున్నదని తెలిపారు. మతోన్మాదాన్ని బలపరిచే వ్యక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అన్నారు. అలాంటి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సిపిఎం మండల నాయకులు గోపాలు, దస్తగిరి, రంగారెడ్డి ,గంగన్న సిఐటియు నాయకులు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

అశ్లీలతను సెన్సార్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ఐద్వా నూతన కమిటీలో పి.నిర్మల

అశ్లీలతను సెన్సార్ చేయాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి .నిర్మల అన్నారు. బుధవారం కార్మిక కర్షక భవన్ డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో పెద్దపాడు మహిళల జనరల్ బాడీ సమావేశాన్ని చిలకమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఐద్వా రాష్ట్ర నాయకులు పి .నిర్మల మాట్లాడుతూ నేడు దేశంలో రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని వీటిని అరికట్టాలి అంటే కఠినమైన చట్టాలతో పాటు ఇంటర్‌నెట్‌లో లభ్యం అవుతున్న అశ్లీలతను పూర్తిగా సెన్సార్ చేయాలని డిమాండ్ చేశారు. మద్యాన్ని అరికట్టకుండా రోజురోజుకీ కూటమి ప్రభుత్వం కూడా ఏరులై పారిస్తుందన్నారు. వైన్ షాపులను విచ్చలవిడిగా ఓపెన్ చేసి తాగండి ఊగండి మహిళలపై దాడులు దౌర్జన్యాలు చేయండి అనేసి ప్రోత్సహిస్తుందని తెలిపారు. వెంటనే కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు మహిళల పైన ఏమాత్రం ఇసుమంతా అభిమానం ఉన్నా అశ్లీలతను సెన్సార్ చేయాలని, సినిమాలు సీరియళ్లలో మహిళలను కించపరిచేలాగా సన్నివేశాలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. మహిళలందరూ ఐక్యంగా ఉద్యమించి మహిళల హక్కుల కోసం పోరాటం చేయాలని కోరారు. పెదపాడు గ్రామం ఐద్వా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా చిలకమ్మ, వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా సంటెమ్మ, సావిత్రి, సహాయ కార్యదర్శిగా శాంతమ్మ కమిటీ సభ్యులుగా ఎలీశమ్మ, షమీం, విజయమ్మలను ఎన్నుకున్నారు. సమావేశంలో మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అమీలియోకు ఎన్ఎబిహెచ్ గుర్తింపు

- ప్రమాణ పత్రం అందుకున్న ఆసుపత్రి ఎండి డాక్టర్ లక్ష్మీప్రసాద్ చాపె

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



జిల్లా కేంద్రంలో అధునాతన పరికరాలు, నిపుణులైన వైద్య బృందంతో అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న అమీలియో హాస్పిటల్ ఎన్ఎబిహెచ్ జాబితాలో చేరినట్లు హాస్పిటల్ ఎండి డాక్టర్ లక్ష్మీప్రసాద్ వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఎన్ఎబిహెచ్ ప్రమాణ పత్రం అందుకున్న సందర్భంగా బుధవారం బళ్లారి రోడ్డులోని హాస్పటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసాద్ చెపే మాట్లాడుతూ ఆసుపత్రి ఆరోగ్య సేవలలో విశిష్టతను సాధిస్తూ, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డుపర్ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడ్స్ ప్రమాణపత్రం అందుకుందన్నామన్నారు.ఈ గుర్తింపు ద్వారా ఆసుపత్రి సేవా ప్రమాణాలు మరింతగా మెరుగవుతాయన్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే మా ప్రధాన లక్ష్యమన్నారు. అతి తక్కువ కాలంలోనే ఈ విశిష్టతను సాధించడం మా వైద్య బృందం కృషి అన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన వైద్య సేవలను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లి రైతుకు భరోసా ఏదీ..?

-ఉల్లి పంటను ట్రాక్టర్లతో దున్నేస్తున్న వైనం
-తీవ్రంగా నష్టపోతున్నామంటూ ఆవేదన

ప్రజాశక్తి-పత్తికొండ




ఉల్లిగిట్టుబాటు కావడం లేదని దున్నేస్తున్న రైతు

సాగుచేసిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారను. పత్తికొండ, తుగ్గలి, దేవనకొండ, మద్దికేర మండలంలో బోరు బావి కింద ఉల్లిసాగు చేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మే, జూన్ మాసంలో బోరు కింద ఉల్లి పంట దాదాపు 3000 ఎకరాలు సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గత 15 రోజులుగా సాగుచేసిన ఉల్లిచేతికి రావడంతో రైతుల ఆశలు మార్కెట్లో ఉల్లి గిట్టుబాటు ధర లేకపోవడంతో అడియాశలయ్యాయి. ఎకరా పొలం సాగు చేయడానికి సుమారు రూ.లక్ష 20 వేలు పెట్టుబడి పెట్టి 50 కేజీల బస్తా 300 నుండి 500 బస్తాలు దిగుబడి వస్తుందంటూ రైతులు చెబుతున్నారు. ఉల్లి పంటకు మార్కెట్లో ధర లేకపోవడంతో ఉద్యానవనశాఖ పరిధిలోని దేవనకొండ మద్దికేర, తుగ్గలి, పత్తికొండ మండల పరిధిలోని పెద్దహుల్తి , మండగిరి, జూటూరు చాలా గ్రామాలలో రైతులు కూలీ ఖర్చులు భరించలేక ట్రాక్టర్లతో దున్ని పొలాలు గట్లమీద వేసి కన్నీరు మున్నీరవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని చెబుతూ ఉల్లి క్వింటా రూ.1200లకు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. రూ.1200 ఎలా గిట్టుబాటు అవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. కోత కోసి మార్కెట్‌కు తీసుకురావడానికి ఎకరాకు రూ.30 వేల ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. సాగు చేయడానికి పెట్టిన పెట్టుబడులు కూలి ఖర్చులు కూడా రావంటున్నారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కనీసం ప్రభుత్వం ఆదుకుంటుందనే అవగాహన వ్యవసాయ అధికారులు కల్పించడం లేదంటూ రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. సాగు చేయడానికి చేసిన అప్పులు తీర్చుకోలేక ఆత్మహత్యలు శరణ్యం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జరగకముందే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం..


పత్తికొండ ఉద్యాన శాఖ అధికారి సునీల్..



కోత కోసి మార్కెట్ కు తీసుకొస్తే క్వింటా రూ.1200లకు కొనుగోలు చేస్తున్నాం. ఏ రైతు నష్టపోకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. ఏవైనా సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

గిట్టుబాటు ధర లేక దున్నేస్తున్నాం


రైతు నాగరాజు, పెద్దహుల్తి



ఉల్లిపంట1.50ఎక రాలలో దాదాపు రూ.లక్ష 25 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశాను. పంట చేతి కొచ్చే సరికి మార్కెట్లో గిట్టుబాటు ధరలేదు. పంటనుట్రాక్టర్‌తో దున్నే స్తున్నాం. అప్పులెలా తీర్చాలో తెలియదు.

క్వింటాలుకు రూ.3000 కు కొనుగోలు చేయాలి

రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దు



క్వింటాలుకు రూ.3000లతో తక్షణమే కొనుగోలు చేయాలి. ఉల్లి పంట సాగు చేయడానికి పెట్టుబడి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.1200 ఏ విధంగా రైతుకు గిట్టుబాటు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు గిట్టుబాటు కల్పించకపోతే రైతులను కలుపుకొని ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

15న స్టేట్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 15న విజయవాడలో జరుగు రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలని, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. నరసింహలు కోరారు. బుధవారం నగరంలోని గణేష్‌నగర్‌లో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. సిఐటియు నగర నాయకులు బి.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.నరసింహులు సిఐటియు నగర నాయకులు బి.రాధాకృష్ణలు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభించాలని కోరుతూ ఈనెల 15న విజయవాడలో లేబర్ కమిషనర్ ఆఫీసు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గతంలో వైసిపి ప్రభుత్వం భవనిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిలుపుదల చేసింది. నిలుపుదల చేసిన సంక్షేమ బోర్డును పున ప్రారంభిస్తామని, మాకు ఓట్లు వేయండి అని తెలుగుదేశం కూటం ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, సంక్షేమ బోర్డును ప్రారంభిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటికీ ఇంకా అమలు చేయకపోవడం చాలా దుర్మార్గం అన్నారు. సంక్షేమ బోర్డులో రూ.4298 కోట్లు కాంట్రాక్టర్ ద్వారా వసూలు చేసిన సెస్సు నిధులు ఉన్నాయన్నారు. ఈ నిధులను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న విజయవాడలో జరుగులేబర్ కమిషనర్ ఆఫీసు ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.



జిజిహెచ్ సూపరిన్‌టెన్‌డెంట్‌కు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కర్నూలు సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు అడిషనల్ డిఎంఇ గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆయనను బుధవారం ఎపి హంస కర్నూలు జిల్లా అధ్యక్షులు రఘు బాబు, జిల్లా కార్యదర్శి సయ్యద్ షఫీ వారి కార్యవర్గంతో పాటు కలిసి పూల మొక్కల అందించి అభినందించారు. కర్నూలు జనరల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను సమస్యలను డాక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి తెచ్చారు. ఎమర్జెన్సీ వార్డులో సిబ్బంది , రోగులకు నిరంతర నీటి సరఫరా, సిబ్బంది భద్రతను నిర్ధారించ డానికి రాత్రి షిఫ్టులలో సెక్యూరిటీ గార్డుల కేటాయింపు, మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా గదుల ఏర్పాటు, సిబ్బందిపై పనిభారాన్ని తగ్గించ డానికి ఎంఎన్ఒ, ఎఫ్ఎన్ఒ ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, క్లాస్ ఫోర్ ఉద్యోగులకు, ప్రత్యేకంగా డ్రైవర్ పోస్టుకు పదోన్నతులు కల్పించడం వంటి సమస్యలను సూపరింటెండెంట్ వివరించారు. ఆయన స్పందించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రభుత్వ వాహన డ్రైవర్లసంఘం జిల్లాఅధ్యక్షులు నాగేశ్వర రావు, ఎపి హంస జిల్లా ప్రచార కార్యదర్శి నాగన్న, కర్నూలు తాలూకా కార్యదర్శి చక్రధర్, తాలూకా నాయకులు మంజునాథ్, సంపత్, రాజేష్ పాల్గొన్నారు.


13న సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల 13న ఉదయం 10గంటలకు ఎస్ఎస్‌ఫంక్షన్ హాల్, గాయత్రి హాస్పిటల్ ఎదురుగా, కొత్త బస్టాండ్ దగ్గర వర్తమాన రాజకీయాలు–సిపిఎం వైఖరి అనే అంశంపై సభ ఉంటుందని సిఐటియు నగర అధ్యక్షులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు, ఎంఏ.గఫూర్ ప్రసంగిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు ,సిపిఎం కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

డయల్ యువర్ ఎస్ఇకి 14 వినతులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ఎపిఎస్‌పిడిసిఎల్ కర్నూలు ఎస్ఇ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమానికి 14 వినతులు వచ్చాయని ఎస్ఇ ఎం. ఉమాపతి తెలిపారు. అందులో స్తంభాలకు సంబంధించి ఐదు, బిల్లులకు సంబంధించి ఒకటి, మీటరుకు సంబంధించి ఒకటిలో వోల్టేజ్ కు సంబంధించి రెండు, ఓల్టేజ్ ఎక్కువ తక్కువ రావడానికి సంబంధించి ఒకటి, ఇతర నాలుగు వినతులు వచ్చాయనితెలిపారు. పై సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సిఐటియు బలోపేతానికి కృషి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సిఐటియు బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. సిఐటియు 4వ మండల మహాసభ బుధవారం రెండో రోజు ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా రాధాకృష్ణ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సమరశీల ఉద్యమాలకు కార్మికులు సన్నద్ధం కావాలని, శ్రమ దోపిడీ చేయిస్తున్న పాలకవర్గాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ, ఆటో, భవన కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని కోరారు. కాయిలావర్డ్ పరిశ్రమలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక: సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.గోవిందు, ఉపాధ్యక్షులుగా బి.గోవర్ధన్, జె.నాగరాజు, ఎ.సురేష్, మండల ప్రధాన కార్యదర్శిగా బి.రాముడు, సహాయ కార్యదర్శులుగా కె.శైలజ, బి.శివలక్ష్మి, ఎస్.నాగలక్ష్మి, రమేష్, కె.ఇస్మాయిల్, కోశాధికారిగా కె.భాషా, కమిటీ సభ్యులుగా 18 మందిని ఎన్నుకున్నారు.

చదువుతో భవిష్యత్తు బంగారుమయం

- ఉత్తమ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు రంగనాయకులు



రంగనాయకులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చదువులో జయిస్తే భవిష్యత్తు బంగారుమయమవుతుందని, విద్యార్థులు తెలుసుకోవాలని ఉత్తమ అవార్డు గ్రహీత రంగనాయకులు తెలిపారు. బుధవారం చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒలు సావిత్రమ్మ, ఫరూక్ ఆధ్వర్యంలో కలెక్టర్ రంజిత్ బాషా చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న రంగనాయకులను పూలమాల, శాలువా వేసి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడారు. ఉత్తమ అవార్డు అందుకోవడం ఆనందం ఉందని, మరోపక్క విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తనకు సన్మానం చేసిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మేళన సభను జయప్రదం చేయండి

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం



సమావేశంలో మాట్లాడుతున్న దేవ సహాయం

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 13న పట్టణంలోని కుర్ణి కల్యాణ మండపంలో పార్టీలకతీతంగా తలపెట్టిన 'దళిత సమ్మేళన సభ'ను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవ సహాయం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటీ ఛైర్మన్ కదిరికోట ఆదెన్న, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ కోరారు. బుధవారం గోనెగండ్ల ఎస్సీ కాలనీలో ఎపి డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా దళిత సమ్మేళన సభ కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... దళితులు పోరాటాలతో సాధించుకున్న అంబేద్కర్ భవన స్థలంలో నిధులు కేటాయించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మిగనూరు పట్టణంలో భారత మాజీ ఉప ప్రధాని, దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి దళితులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. గోనెగండ్ల ఎంపిటిసి తాయప్ప, రంగస్వామి పాల్గొన్నారు.

నేడు పక్కీరప్ప తాత ఆరాధన

ప్రజాశక్తి - ఆస్పరి



మాట్లాడుతున్న గ్రామపెద్దలు

ఆస్పరిలో వెలసిన శ్రీపక్కీరప్ప తాత దేవస్థానంలో మొదటి ఆరాధనోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు ఉరుకుందప్ప, గోవిందప్ప, ఓబులేసు, మహానంది, రాముడు, నాగేష్, రఘు, రామాంజినేయులు బుధవారం తెలిపారు. ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం, హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాత్రి భజన కార్యక్రమం ఉంటుందన్నారు.

సులభ సంపాదనతో చిన్నారుల తప్పుదోవ

- విద్యకు దూరమవుతున్న యువత - కనిపించని నిర్బంధ విద్యా హక్కు చట్టం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో చిన్నారులు సులభ సంపాదనతో విద్యకు దూరమై తప్పుదోవ పడుతున్నారు. ఉన్నత విద్యకు దూరమై సులభ సంపాదనతో యువత చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇక్కడ నిర్బంధ విద్యాహక్కు చట్టం కనిపించడం లేదు.

రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా ఉంటుంది. ఇదే అవకాశంగా భావించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కొందరు తల్లిదండ్రులు పిల్లలను భక్తులకు బొట్టు పెట్టేందుకు పంపుతున్నారు. చిన్నారులే కదా అని భక్తులు కూడా బొట్టు పెట్టించుకొని రూ.10 ఇస్తున్నారు. ఎంత మంది ఉంటే అంత మంది నుంచి రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. సుమారు 40 మందికి పైగా ప్రతి గురు, ఆదివారంతో పాటు రద్దీ సమయంలో ప్రతి ఒక్కరూ రూ.వందలు, రూ.వేలు సంపాదిస్తున్నారు. మరికొందరు అమ్మాయిలు గంగపూజ అంటూ తుంగభద్ర నదిలో పూజలు చేస్తే మంచిదంటూ మహిళలకు నచ్చజెప్పి ఆకులు, వక్క, బీటేలు, అగరబత్తులు, పసుపు కుంకుమతో కలిపి అమ్ముతూ డబ్బులు సంపాదించే పనిలో పడ్డారు. సులభ సంపాదనతో పాఠశాలలకు ఎగనామం పెడుతున్నారు. చేతి నిండా డబ్బులు సంపాదిస్తున్నప్పుడు ఇక చదువులు ఎందుకు లే అంటూ తల్లిదండ్రుల మాటలు వినకుండా చిన్న వయస్సులోనే చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. కొంతమంది యువకులు చదువులను మధ్యలో మానేసి భక్తులకు లాడ్జీల్లో రూములు ఇప్పించి వారివద్ద కమీషను తీసుకొని ఇష్టారాజ్యంగా మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చిన్న వయస్సులోనే జబ్బుల బారిన పడి మృతి చెందిన వారి సంఖ్య పెరుగుతోంది. మరికొందరు 10వ తరగతి వరకు చదివి ఉన్నత చదువులకు వెళ్లకుండా చిన్న వ్యాపారాలు చేసుకుంటూ సులభ సంపాదనతో జీవిస్తున్నారు. చెడుదారి పడుతున్న బాలబాలికలను, వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఇతర సిబ్బంది అవగాహన కల్పించినా కొందరు మళ్లీ యథాతథంగా నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై ఎంఇఒ మొయినుద్దీన్ దృష్టికి ప్రజాశక్తి తీసుకెళ్లి... బడి ఈడు పిల్లలను బడికి పంపే ప్రయత్నం చేయగా, ఆయన మాట కూడా పెడచెవిన పెట్టి పారిపోతున్నారు. రెవెన్యూ, పోలీసు, శిశు సంక్షేమ, విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా కదిలి విద్య ఆవశ్యకతను వివరించి విధిగా చర్యలు తీసుకోవాలని, విద్యాహక్కు చట్టం ద్వారా బాలబాలికల జీవితాల్లో మార్పు తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకపోతే చిన్న వయస్సులోనే జీవితాలు నాశనం చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి భావిభారత పౌరుల భవిష్యత్తు కోసం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.




చిన్నారులతో మాట్లాడుతున్న అధికారి

మానవత్వం లేని 'కూటమి'

- ఎమ్మెల్యే విరుపాక్షి
- బాధిత కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి మానవత్వం లేదని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చిగిలి గ్రామంలో ఆగస్టు 20న నీటి కుంటలో పడి మృతి చెందిన ఆరుగురు చిన్నారుల కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరుగురు చిన్నారులు నీటి కుంటలో పడి మృతి చెందిన సంఘటన రాష్ట్రంలో సంచలనంగా మారినా ఆదుకునేందుకు ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ బాధిత కుటుంబాలకు న్యాయం జరగకపోవడం విచారకరమన్నారు. సంఘటన జరిగిన రోజు తాను బాధిత కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశానని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదన్నారు. అదే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే బాధిత కుటుంబాలకు సహాయం అందేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలంటే దయ లేదని, వారు ఈవిఎం మిషన్ల ద్వారా గెలవడం వల్ల ప్రజల పట్ల ప్రేమ లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైసిపి మండల కన్వీనర్ బసవరాజు, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహానంది, జిల్లా యూత్ కార్యదర్శి ప్రకాష్, ఎంపిటిసి రాధాకృష్ణ, సర్పంచులు జయమ్మ, హరికృష్ణ, వెంకటేష్, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు వెంకన్న, శివానంద, దత్తాత్రేయ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తిమ్మప్ప, ప్రకాష్, మోహన్, లక్ష్మణ్, పాండు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

నానో యూరియాపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - చిప్పగిరి

నానో యూరియాపై బుధవారం చిప్పగిరి రైతు సేవా కేంద్రంలో ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూరియా అధికంగా వాడడం వల్ల కలిగే నష్టాల గురించి రైతులకు అర్థమయ్యేటట్లు వివరించారు. నానో యూరియా వల్ల ఉపయోగాల గురించి తెలిపారు. నానో యూరియా అనేది సాధారణ యూరియాకు ప్రత్యేకమని, ఇది ద్రవ రూపంలో లభిస్తుందని చెప్పారు. పంటలపై పిచికారి రూపంలో స్ప్రే చేర్చుకోవచ్చని, నానో యూరియా ద్వారా పంటలకు అవసరమైన నత్రజని ఆకుల ద్వారా నేరుగా లభిస్తుందని తెలిపారు. దీనివల్ల పంటల పెరుగుదల మెరుగవుతుందని, ఒక లీటరు నానో యూరియా బాటిల్ ఒక సాధారణ యూరియా బస్తాతో సమానమని చెప్పారు. యూరియా వాడకం వల్ల భూమిలోని సారం కూడా కోల్పోవాల్సి వస్తుందన్నారు. జిల్లాలో యూరియా కోసం కమాండో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిందని, యూరియా కావాల్సిన వారు 8341302863 మొబైల్ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఎఇఒ రమాదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీరామ్ ప్రవీణ్

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని బసాపురం గ్రామంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఎడిఎ బి.బాలవర్ధి రాజు, ఎఒ బివిజి.సుధాకర్ బుధవారం యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బసాపురం గ్రామంతో పాటు ఇతర గ్రామాలకు కలిపి మొత్తం 75.6 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. నానో యూరియా వాడకం ద్వారా కలిగే ప్రయోజనాలు, దాని సమర్థత, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి సాగు చేసిన ప్రతి రైతుకూ తగినంత యూరియా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 'పొలం పిలుస్తుంది'లో భాగంగా అధికారులు వరి పంట పొలాలను సందర్శించి, పంటల పెరుగుదల పరిస్థితులు, ఎరువుల వినియోగంపై పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారి పి.సతీష్, ఎంపిఇఒ టి.చిన్న అయ్యన్న, గ్రామ వ్యవసాయ సహాయకుడు టి.వీరేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



రైతులకు యూరియా అందిస్తున్న వ్యవసాయ అధికారులు

పోషకాహారంతో క్షయ నిర్మూలన

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - ఆదోని

పోషకాహార లోపం వల్ల సంక్రమించే క్షయవ్యాధిని అధిగమించేందుకు రోగులకు పోషకాహారం అవసరమని, అలాంటి వారికి తమవంతు సహాయం అందించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి కోరారు. బుధవారం వారి కార్యాలయ ఆవరణలో పేద రోగులకు మున్సిపల్ ఉపాధ్యాయులు అయాజుద్దీన్, నిరంజన్, మీనాక్షి దాతృత్వంతో పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఎంఒటిసి డాక్టర్ షేకున్ భాను సమక్షంలో నిర్వహించారు. సూపర్‌వైజర్లు బాబురాజు, మంజునాథ్, భాస్కర్, టిబిహెచ్‌వి సుబ్బమ్మ బాయి, ఎల్‌టి పద్మావతి, రవికుమార్, వీరేష్ పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న మున్సిపల్ టీచర్లు

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- సిడిపిఒ నర్సమ్మ

ప్రజాశక్తి -ఆలూరు

ఆలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు సిడిపిఒ కె.నర్సమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్కర్ పోస్టుకు హోళగుంద మండలం బిజి.హళ్లి గ్రామంలో బీసీ (ఈ), హెల్పర్స్ పోస్టుకు కోగిలతోట-1లో బీసీ (బి), నెరణికి-2లో ఈడబ్ల్యుఎస్, చిప్పగిరి మండలం ఏరూరు-1లో హెల్పర్ పోస్టుకు బీసీ (ఈ) ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు వర్కర్ పోస్టుకు 10వ తరగతి, హెల్పర్స్ పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. జులై 1, 2025 నాటికీ 21 ఏళ్లు నిండి 35 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. వివాహితులై స్థానిక నివాసులై ఉండాలన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను జతపరచి ఈనెల 17లోపు ఐసిడిఎస్ కార్యాలయంలో ఇవ్వాలని, వివరాలకు కార్యాలయంలోని అధికారులను సంప్రదించాలని కోరారు.

హైస్కూల్‌కు హిందీ ఉపాధ్యాయుడు నియామకం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుని నియమించారు. 'హిందీ ఉపాధ్యాయుడు లేక విద్యార్థుల అవస్థలు' అన్న శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో గత కొన్ని రోజుల క్రితం వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన విద్యాశాఖ అధికారి హిందీ ఉపాధ్యాయుని నియమించింది. గతంలో ఇక్కడ పని చేసిన హిందీ ఉపాధ్యాయుడు బదిలీ ఉత్తర్వుల మేరకు రిలీవర్ రాకపోయినప్పటికీ కల్లూరు మండలం నాయకల్లు జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లారు. హిందీ ఉపాధ్యాయుని డిప్యూటేషన్‌పై వారానికి మూడు రోజులు హిందీ పాఠ్యాంశాలు దేవనకొండ హైస్కూల్ విద్యార్థులకు బోధించేలా చర్యలు తీసుకున్నారని. విద్యార్థుల అవస్థలు తీరాయి. బుధవారం విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



మగ్దుం బాషను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్‌లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు మగ్దుం బాష తెలిపారు. బుధవారం ఆదోనిలో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక గౌరవాధ్యక్షులు టి.ఈరన్న సమక్షంలో జరిగింది. అధ్యక్షులుగా మగ్దుం బాష, ప్రధాన కార్యదర్శిగా బలరాం సింగ్, ఉపాధ్యక్షులుగా నరసప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వైఎమ్‌డి.గౌస్, జాయింట్ సెక్రటరీగా రవీంద్ర గౌడ్, ట్రెజరర్‌గా గౌస్ మహ్మద్, గౌరవ సలహాదారులుగా వి ఫైవ్ నాగరాజ్, గౌరవ ఉపాధ్యక్షులుగా డేవిడ్ ఎన్నికయ్యారు. మగ్దుం బాషను పూలమాల, శాలువాతో సన్మానించారు. మగ్దుం బాష మాట్లాడుతూ... అక్రిడిటేషన్ ప్రామాణికం కాకుండా వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు, బీమా సదుపాయం, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు.

అనారోగ్యంతో జల్లేడుబుడకల సర్పంచి మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని జిల్లేడు బుడకల గ్రామానికి చెందిన సర్పంచి గోసి హనుమంతు(74) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి సోదరుడు వెంకటేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రచార యాత్రను జయప్రదం చేయండి

- యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు దావీదు, ఎల్లప్ప

ప్రజాశక్తి - నందవరం

విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికి జరిగే పోరాట ప్రచార యాత్రను జయప్రదం చేయాలని యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు ఎస్.దావీదు, రాష్ట్ర కౌన్సిలర్ జె.ఎల్లప్ప కోరారు. విద్యారంగ సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని ఈనెల 15 నుంచి 19 వరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి ప్రచారబైక్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం నందవరం, ముగతి, జగ్గాపురం పాఠశాలల్లో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. నాణ్యమైన విద్యనందిస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రయివేట్‌కు తరలిపోయే విధానాలు రూపొందిస్తున్నారని తెలిపారు. బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులకు అంటకడుతూ పని భారం పెంచుతున్నారని మండిపడ్డారు. బోధనేతర పనులను నుంచి మినహాయించి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌గా మార్చేందుకు ఒక్కడుగు కూడా ముందుకు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సమస్యలతో పాటు ఉద్యోగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధనపై కేంద్రీకరించే పరిస్థితులు కల్పించాలని కోరారు. రణభేరిలో ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు వెంకట్రాముడు, నాగరాజు, నరసింహులు, నరసన్న, విరుపాక్షి, మద్దయ్య, ఉమాదేవి, మహాలక్ష్మి, లక్ష్మి కళ, ధర్మన్న, రామకృష్ణ, కేశవయ్య, ఉమాపతి, సూరజ్, లతీఫ్, జి.నారాయణ, రవికుమార్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** విద్యా వనరుల కేంద్రం వద్ద గోడ పత్రికలను విడుదల చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు, యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు లింగన్న, జిల్లా కౌన్సిలర్ అబ్దుల్ సలీం, సీనియర్ నాయకులు తాజుద్దీన్, చౌడయ్య, రంగస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు. **దేవనకొండ** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రణభేరి గోడపత్రికలను విడుదల చేశారు. యుటిఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువా, మండల అధ్యక్షులు రాంప్రసాద్, సీనియర్ నాయకులు రామచంద్రుడు, మద్దిలేటి, ఆనంద్, రాజశేఖర్, రణధీర్, డేవిడ్, దేవనకొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ పాల్గొన్నారు. **ఆదోనిరూరల్** మండలం పెద్ద హరివాణం గ్రామంలో జడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రుడు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు నాగేంద్రుడు, శివకుమార్ గౌడ్, గణేష్, రవి, వెంకటేష్, రామన్న పాల్గొన్నారు.



నందవరంలో గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు



గోనెగండ్లలో గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు



ఎమ్మెల్సీ బీటీ.నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి

- అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకు వేర్వేరుగా వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అభ్యుదయ దళిత సేవాసంఘం అధ్యక్షులు టి.వాసు బాబు, కార్యదర్శి కల్లుపోతుల రంగన్న మాట్లాడారు. కొత్త జిల్లాల ఏర్పాటు, మండలాల పునర్విభజన పేర్ల మార్పులు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం స్వాగతిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో దళిత ముఖ్యమంత్రిగా సేవలందించిన దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లా వాసిగా గుర్తింపు తెచ్చుకున్నారని, ఆయనకు గౌరవమిచ్చేలా కర్నూలుకు దామోదరం పేరు నామకరణం జరిగేలా చొరవ చూపాలని కోరారు. వినతిపత్రాలు స్వీకరించిన వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంకనూరు వీరేష్, సెక్రటరీలు ఆంజనేయులు, సిఆర్.స్వామి, నరసన్న, గోల్డ్ రమేష్, ఎం.గోపాల్ ఉన్నారు.

క్రీడా పోటీల్లో 'రావూస్' సత్తా

- చదువుతోపాటు క్రీడలపైనా దృష్టి సారించాలి - సిఇఒ తిరుమలరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు వివేకానంద ప్రీమియర్ లీగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో సత్తా చాటాలని కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి తెలిపారు. బుధవారం ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రావూస్ అంటేనే నాణ్యమైన విద్యతోపాటు క్రీడలకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని చెప్పారు. పట్టణంలో వినాయక పండగ వేడుకల్లో భాగంగా వివేకానంద ప్రీమియర్ లీగ్ సంస్థ క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో గ్రామీణ, పరిసర ప్రాంత విద్యార్థులే గాక పట్టణంలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఫైనల్ మ్యాచ్‌లో రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు గెలిచి సత్తాచాటారని తెలిపారు. జట్టులో కెప్టెన్ ఇమ్రాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' లభించిందన్నారు. అలాగే బెస్ట్ బౌలర్‌గా నరసింహం, బెస్ట్ ఫీల్డర్‌గా లోకేష్ ఎంపికయ్యారని తెలిపారు. రాణించిన విద్యార్థులను తిరుమలరెడ్డి, సిఒఒ సుజనా రెడ్డి, ప్రిన్సిపల్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకులు ధనుంజయ, గోవిందు, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న రావూస్ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి

మహేందర్ రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మహేందర్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కామవరం మహేందర్ రెడ్డిని వైసిపి ఆరెకల్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఆరెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ ఆరెకల్ నాగరాజ్, వైసిపి నాయకులు శాంత కుమార్ మహేందర్ రెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి విజయం సాధించేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

ప్రజాశక్తి - ఆస్పరి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పని భారం తగ్గించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప, రాష్ట్ర మాజీ కౌన్సిలర్ నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కారుమంచి, బిల్లేకల్లు, ములుగుందం, బనవనూరు, కైరుప్పల గ్రామాల్లోని ఎంపిపిఎస్, జడ్‌పిహెచ్ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఎస్‌టియు సీనియర్ నాయకులు శ్రీనివాసులు, జ్యోతిమూర్తి, అల్తాఫ్, లక్ష్మీపతి, రామాంజినేయులు, ఉరుకుందు, విశ్వనాథ్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్‌టియు నాయకులు

మంత్రాలయంలో భారీ వర్షం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో భారీ వర్షం కురిసింది. బుధవారం సుమారు గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కురిసిన వర్షాలకు వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నదీతీరంలో ఉన్న దుకాణాల్లోకి వర్షపు నీరు చేరడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మృతురాలి కుటుంబానికి నివాళి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కట్టుబడి ఖాదర్ బాషా తల్లి హసీనా మృతికి టిడిపి ఇన్‌ఛార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి కుమారుడు, యువ నేత రాకేష్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం అనారోగ్యం కారణంగా హసీనా మరణించిన విషయం తెలుసుకున్న రాకేష్ రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలుదేవకుంట సొసైటీ ఛైర్మన్ రాగమ్మ, షబ్బీర్ సాహెబ్, పవన్, గోపాల్, వీరారెడ్డి, లింగన్న పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న యువనేత రాకేష్‌రెడ్డి

ఆదోనిని జిల్లాగా ప్రకటించాలి

- రాష్ట్ర మంత్రికి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌ను ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. బుధవారం అనంతపురం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సత్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆదోని నియోజకవర్గ సమస్యలను ఆయనకు దృష్టికి తీసుకెళ్లారు. ఒకే మండలంగా ఉన్న ఆదోనిని నాలుగు మండలాలుగా విభజించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.



సత్య కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

యూరియా వాడకం తగ్గించాలి

- తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలు : ఎఒ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రైతుల పండించిన పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించి తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలు పొందవచ్చని ఎఒ శివ శంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని పార్లపల్లి, రాళ్లదొడ్డి గ్రామాల్లో ఎఒ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉల్లి పంట వేసిన 100 నుంచి 110 రోజులకు కోతకు వస్తుందని, ముందస్తుగా కోత కోయకూడదని తెలిపారు. ఉల్లిగడ్డ పరిమాణంలో, నాణ్యత ఉండి రైతులు ఆరబెట్టుకొని మార్కెట్ యార్డుకు తీసుకెళ్తే ప్రభుత్వ మద్దతు ధర వస్తుందని చెప్పారు. పంట నమోదు విధిగా చేయించుకోవాలన్నారు. అధిక యూరియా వాడకం వల్ల అనేక పర్యావరణ, ఆర్థిక సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. రసాయన ఎరువుల అధిక వాడకం నేలలోని సూక్ష్మజీవులను, సేంద్రీయ పదార్థాన్ని నాశనం చేస్తుందన్నారు. పశువుల ఎరువులు కంపోస్టు వర్మీ కంపోస్ట్ వంటివి భూమిలో సూక్ష్మజీవుల క్రియాశీలతను పెంచి సహజంగా నైట్రోజన్‌ను అందిస్తాయన్నారు. పప్పు పంటలను (కంది, పెసర, మినుములు) ఇతర పంటలతో మార్చి వేయడం వల్ల వాటి వేళ్లలో ఉండే రైజోబియం బ్యాక్టీరియా నేలలో నత్రజనిని పెంచుతుందని తెలిపారు. అధిక యూరియా వాడకం వల్ల పంటలు బలహీనపడి, పురుగులకు ఎక్కువగా గురవుతాయని, సమతుల్య పోషణతో పంటలు ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. తద్వారా పురుగుమందుల ఖర్చు తగ్గుతుందని, పంట దిగుబడి, పెరుగుదల సరైన పోషకాలు అందడం వల్ల పంటలు ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడిని ఇస్తాయని వివరించారు. రైతులకు రైతుకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఎఇఒలు రసూల్, వినోద్, విహెచ్ఎ రమేష్, విఎఎ రాజేష్ పాల్గొన్నారు.

ఆత్మహత్య అత్యంత ప్రమాదకరం

ప్రజాశక్తి- కర్నూల్ హాస్పిటల్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ అవగాహన దినోత్సవం పురస్కరించుకొని మానసిక ఆరోగ్య సమస్యల బ్యానర్‌ను రాష్ట్రీయ బాల ఆరోగ్య సమన్వయకర్త డాక్టర్.మహేశ్వర్ ప్రసాద్, మానసిక వైద్యులు డాక్టర్ చైతన్యతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ ఏదైనా ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన అత్యంత ప్రమాదకరమని, దీన్ని నుంచి బయటపడాలంటే మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు. తీవ్రస్థాయికి పెరిగిన మానసిక ఒత్తిడి సంఘర్షణలతో పలువురు ప్రాణాలు తీసుకుంటున్నారని ఆత్మహత్య చేసు కొనే ముందు ఒక్క క్షణం ఆలోచించాలని తెలిపారు. మరణించాలనుకొనే వారి ప్రవర్తన భిన్నంగా ఉంటుందని ఒంటరిగా ఉండడము దురలవాట్లు పెంచుకోవడం, నిరాశ, నిస్పృహలతో మాట్లాడుతారని అన్నారు. జీవితం వ్యర్థమనే బాధలో తమకిష్టమైనవి ఇతరులకు ఇస్తారని తెలిపారు. తల్లితండ్రులు కుటుంబ సభ్యులు, పిల్లల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలని, నిత్యం సంభాషించుకోవాలని తెలిపారు. మానసిక వైద్యులు డాక్టర్‌చైతన్య నర్సింగ్ కళాశాలలో విద్యార్థినిలకు మానసిక వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చునని తెలిపారు. బంధువులు, స్నేహితుల వద్ద పదే పదే



ఆత్మహత్య నివారణ దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్యాధికారులు

చనిపోతానంటూ ప్రస్తావించడం, ఆకలి, నిద్రకు దూరమవుతారన్నారు. ఒంటరిగా ఉండడం, ఎవరి దగ్గరకి వెళ్లకుండా ఉండడం, వారిలోవారేనవ్వు కోవడం, అనుమానాలు, తరచూబాధ పడతారన్నారు. ఆత్మహత్యల నివారణకు టెలిమానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416 ను సంప్రదించి నిపుణుల ద్వారా ఉపశమనం పొందవచ్చునని. ఇక్కడ సుశిక్షితులైన సైకి యా ట్రిస్టులు, కౌన్సిలర్‌లు తగిన సలహాలు సూచనలు అందిస్తారని అన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, డెమో శ్రీనివాసులశెట్టి, డెప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ , ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమల

ప్రజాశక్తి-వెల్దుర్తి

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమల అన్నారు. బుధవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎస్‌సి బాలికల గురుకులం, బాలికల హైస్కూల్, బీసీ బాలికల హాస్టల్, సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి, రేషన్‌షాపు, సివిల్ సప్లై స్టాకు పాయింట్ల తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజన సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. బాలికల హైస్కూల్ విద్యార్థినులు ఇళ్ల వద్ద నుంచి క్యారియర్ తీసుకువచ్చి ఉండడాన్ని గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నాణ్యతగా వండితే ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తాయంటూ హెచ్‌ఎంపై ఆగ్రహించారు. బీసీ బాలికల గురుకులంలో మెనూ పాటించాలని ఆదేశిస్తూ, ఎస్సీ బాలికల గురుకులంలో వంటలు, భోజన వసతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, భోజన సిబ్బందితో కలిసి ఫోటో దిగి సంతోషం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు. సౌకర్యాలు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి పౌష్టికాహారం అందుతుందా అని విచారించారు. అనంతరం పట్టణంలోని రేషన్ షాపు, సివిల్ సప్లై స్టాకు పాయింట్ గోడౌన్



హాస్టల్‌లో వంతలను పరిశీలిస్తున్న సేఫ్టీ ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమల

పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఏ భోజన పథకమైనా నాణ్యత, పరిమాణంలో తేడాలు లేకుండా, మెనూ ప్రకారం లబ్ధిదారులకు అందించేలా చూడడమే తమ బాధ్యత అన్నారు. ఆమె వెంట తూనికల కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీరాములు, సివిల్ సప్లై జిల్లా అధికారి రఘువీర్, ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి రాజగోపాల్, ఐసిడిఎస్ పిడి విజయ, సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి రఘు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు. సిడిపిఒ ల్యూక్, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, డిటి గురుస్వామి రెడ్డి, గురుకులాల ప్రిన్సిపాళ్లు నరసమ్మ, లక్ష్మి ప్రసూన, ఆసుపత్రి సూపరింటెండెంట్ బాల చంద్ర రెడ్డి, హాస్టల్ వార్డెన్ నీరజ పాల్గొన్నారు.

మొండి బకాయిదారులపై ఉదాసీనత సహించం

-ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి బకాయిలను రాబట్టాలి
-నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలకు సంబంధించి మొండి బకాయిల వసూళ్ల విషయంలో ఎలాంటి ఉదాసీనతను సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సమావేశ భవనంలో పన్ను వసూళ్లపై రెవెన్యూ, ఇంజనీరింగ్, నోడల్ అధికారులు, అడ్మిన్, అమినిటీస్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను బకాయిలు దాదాపు రూ.93 కోట్లు ఉన్నాయని, అందులో టాప్-100 బకాయిదారుల నుండి రూ.12.76 కోట్లు వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. తాగునీటి కొళాయి చార్జీల బకాయిలు మొత్తం రూ.21 కోట్లు ఉండగా, టాప్-100 బకాయిదారులే రూ.7 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. నోడల్ అధికారుల నేతృత్వంలో డిఇఇ, ఎఇ, అడ్మిన్, అమినిటీస్ కార్యదర్శులు సమన్వయంతో, వారివారీ పరిధిలో టాప్-100 మొండి బకాయిదారులపై ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. నగర వ్యాప్తంగా టాప్-100 బకాయిల వసూళ్లకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా, గత ఆర్థిక సంవత్సరంలో తాగునీటి కొళాయి చార్జీలను 95శాతం వసూలు చేసిన 115 అమినిటీస్ కార్యదర్శిని కమిషనర్ అభినందించారు. ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్‌ఒలు జునైద్, వాజీద్, స్వర్ణలత, ఎస్ఇ శేషసాయి, ఎంఇ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురవరం ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి -కోడుమూరు : సురవరం సుధాకర్ రెడ్డి, త్యాగం వృథా కాదని, వారి ఆశయాలను కొనసాగిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య అన్నారు. బుధవారం కోడుమూరు పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో, స్నేహ వినాయక కళ్యాణ మండపంలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి డి శేష్ కుమార్ అధ్యక్షత వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య , ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, చేతివృత్తుల దారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న, సిపిఐ జిల్లా సమితి సభ్యులు, కోడుమూరు సిపిఐ సీనియర్ నాయకులు, బి కృష్ణ, శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి, ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వర్ రెడ్డి, కోడుమూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులుకే హేమాద్రి రెడ్డి, టిడిపి మధుసూదన్ రెడ్డి, వైసిపి



నియోజకవర్గ నాయకులు ఆదిమూలపు సతీష్, జడ్పిటిసి రఘునాథ్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి బి రాజు, సిపిఎం సీనియర్ నాయకులు గఫూర్మియా, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, బి మాధవ స్వామి తదితరులు సుధా కర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సురవం సిపిఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. రెండుసార్లు నల్లగొండలో ఎంపిగా గెలిచి ఏనాడు కూడా పదవులు ఆశించలేదన్నారు. ఆయన మరణించిన తర్వాత దేహంలో ఉన్న అవయవాలను ఇతరులకు ఉపయోగపడాలని తన దేహం వైజ్ఞానానికి ఉపయోగపడాలని, తనకు ఉన్నటువంటి ఆస్తిని కూడా పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్ణయించారన్నారు.



పంటల సాగు నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి -కోడుమూరు

సాగు చేసిన పంటలను రైతులు వ్యవసాయ శాఖ వద్ద నమోదు చేసుకోవాలని కోడుమూరు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ అన్నారు. పంట నమోదు అనేది రైతు భరోసాకు తప్పనిసరి అయినందున రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలోని వెంకటగిరి గ్రామానికి మండల తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి, రైతు సేవ కేంద్రం సిబ్బంది వెంకటగిరి గ్రామ ఉల్లి రైతులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలు రూ.1200 ఇస్తుందని తెలిపారు. ఉల్లి పంటను కచ్చితంగా 120 రోజులు పొలంలో ఉండేలా తర్వాత మాత్రమే పంటను తీయాలని, తద్వారా కాయ నాణ్యత, దిగుబడి పెరుగుతుందని రైతులకు సూచించారు.ఉల్లి పంట వేసిన రైతులు పంట నమోదు కచ్చితంగా చేయించుకుని తద్వారా ఎంఎస్‌పికి ప్రభుత్వానికి అమ్ముకోవడానికి వీలవుతుందని, ఉల్లి పంట వేసిన రైతులు ఆందోళన చెందకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గ్రామాల్లో రైతులకు తెలపడానికి తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి రైతులకు భరోసా కల్పించే ప్రయత్నం చేవారు .



మాట్లాడుతున్న ఎంవి.సుబ్రమణ్యం

పెన్షనర్ల బకాయిలను చెల్లించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంవి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలులోని స్థానిక సి క్యాంపులోని పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎంవి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సంఘం ఎన్నికలను అక్టోబర్ చివరి కల్లా పూర్తి చేయాలన్నారు. అసోసియేషన్‌కు భవనం ఏర్పాటుకు కూడా దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రెటరీ శివారెడ్డి, ట్రెజరర్ రాజారావు, అడ్వైజర్ కమిటీ నెంబర్లు కోట్ల లింగన్న, క్రిస్టఫర్, మోహన్ రావు, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

15న చలో విజయవాడ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ఈనెల 15న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమం లో కార్మికులందరూ పాల్గొనాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ఉపాధ్యక్షుడు కె సుధాకరప్ప కార్మికులను కోరారు. బుధవారం 32 వార్డ్ ముజఫర్ నగర్ లో మట్టి పని కార్మికుల సమావేశం ఎం రామలింగం అధ్యక్షతన నిర్వహించారు. మట్టి పని కార్మికులు మద్దమ్మ, సుంకులమ్మ ,లక్ష్మీదేవి , మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



మరిన్ని అవార్డులు సాధించాలి : టిజివి

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ : అనంతపురం పరిషత్తులో టీజీవి కళా క్షేత్రం కళాకారులు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించడం జిల్లాకు గర్వకారణమని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఎపి నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రిటైర్డ్ అడిషనల్ డీజీపీ తెలంగాణ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిలు కళాకారులను అభినందించారు. బుధవారం కర్నూలులో వేర్వేరు కార్యక్రమాల్లో జగదేక సుందరి సామ పద్య నాటక విజేతలను అభినందించారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఇప్పటికే 38 నందులతో పాటు ఎన్నో అవార్డులు టిజివి కళాక్షేత్రం కళాకారులు సాధించారని అన్నారు. ఈరోజు మరొక అపూర్వ విజయమన్నారు. దర్శకులు ఓబులయ్య, నటులు జీవి శ్రీనివాస్ రెడ్డి, పి.రాజారత్నం, సంగా ఆంజనేయులు, వాల్మీకి రాముడు కె.బాల వెంకటేశ్వర్లుతో పాటు నవీన్ కుమార్ గాండ్ల లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.